క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

అంబాజీపేట: మండలంలో గంగలకుర్రు సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.రాంబాబు ప్రకటనలో తెలిపారు. గంగలకుర్రు, కె.పెదపూడి, మొసలపల్లి, పాలగుమ్మి, పుల్లేటికుర్రు, వ్యాఘ్రేశ్వరం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. 11 కేవీ విద్యుత్ లైన్లు మరమ్మతులు చేపట్టనున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

గంగలకుర్రులో నేడు లఘు రుద్ర మహాక్రతువు

అంబాజీపేట: పశ్చిమగోదావరి జిల్లా భీమవరానికి చెందిన శ్రీమాస శివరాత్రి అభిషేక కమిటీ ఆధ్వర్యంలో లఘు రుద్ర మహాక్రతువును ఆదివారం గంగలకుర్రులో నిర్వహిస్తున్నట్టు నిర్వహణ కమిటీ తెలిపింది. స్వయంభువులైన ఏకాదశరుద్రులకు లఘురుద్రాభిషేకం చేయడంలో భాగంలో గంగలకుర్రులో వేంచేసిన సర్వమంగళా పార్వతీ సమేత చెన్నమల్లేశ్వరస్వామికి పూజలు చేయనున్నట్లు కమిటీ తెలిపింది.

ఆలయ అభివృద్ధికి రూ.50 వేల విరాళం



అయ్యప్పస్వామి ఆలయ అభివృద్ధికి విరాళాన్ని అందజేస్తున్న దాత సత్యనారాయణ

ఆలమూరు: స్థానిక అయ్యప్ప స్వామి ఆలయ అభివృద్ధికి గ్రామానికి చెందిన చిలుకూరి సత్యనారాయణ రూ.50 వేల విరాళం అందజేశారు. ఆలయ అభివృద్ధిలో భాగంగా తన వంతు సాయంగా దాత సత్యనారాయణ ఈ విరాళాన్ని శనివారం ఆలయ వ్యవస్థాపకుడు పి.ముకుందేశ్వర స్వామి, ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ వంటిపల్లి సతీష్‌కుమార్, ఆలయ ప్రధాన అర్చకుడు అంగర వేణుగోపాలాచార్యులకు అందించారు. దాత కుటుంబీకులను పలువురు గ్రామస్తులు అభినందించారు.

వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యం

అంబాజీపేట: ప్రస్తుత వాతావరణంలో ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని అంబాజీపేట వైద్యాధికారి కేవీఎస్ శ్రీనివాస్ అన్నారు. గంగలకుర్రు ఇంటిగ్రేటెడ్ వసతి గృహంలో ఉన్న విద్యార్థులకు సీహెచ్‌ఓ బి.అప్పారావు అధ్యక్షతన వైద్య పరీక్షలను శనివారం చేశారు. వైద్యాధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ భోజనం చేసే ముందు సబ్బుతో చేతులు శుభ్రం చేసుకోవాలన్నారు. ప్రస్తుత వాతావరణంలో చలిగాలులు, మంచు అధికంగా కురుస్తున్న నేపథ్యంలో దోమలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. దోమలు నిల్వ ఉండకుండా మన చుట్టూ ఉండే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ బి.అప్పారావు, ఎల్‌టీపీ రవితేజ, ఎంపీహెచ్‌ఏ జీవీవీకే ప్రసాద్, ఏఎన్ఎం ఎస్.నాగలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ దుర్గాప్రసాద్, ఆశాలు పాల్గొన్నారు.

బీకేఎస్ జిల్లా అధ్యక్షుడిగా సూర్యనారాయణరాజు



అంబాజీపేటలో బీకేఎస్ నూతన కార్యవర్గం

అంబాజీపేట: బీకేఎస్ కోనసీమ జిల్లా అధ్యక్షుడిగా చేకూరి సూర్యనారాయణరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అంబాజీపేట కృషీవల కోకోనట్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ లిమిటెడ్ కార్యాలయంలో జిల్లా ఇన్‌చార్జి పరిమి రాఘవులు అధ్యక్షతన బీకేఎస్ నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా యాళ్ల వెంకటానందం, ప్రధాన కార్యదర్శిగా అడబాల రాజమోహన్, కోశాధికారిగా వంకాయల స్వామి ప్రకాష్, ఉపాధ్యక్షులుగా మాకిరెడ్డి సత్తిబాబు, వేగేశ్న సూర్యనారాయణరాజు, సహాయ కార్యదర్శులుగా అప్పారి వెంకటరమణ, దంగేటి గిరిధర్, మహిళా ప్రముఖ్ మాకిరెడ్డి పూర్ణిమ, సభ్యులు అబ్బిరెడ్డి రంగబాబు, వేటుకూరి శ్రీనివాసరావులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు, ముత్యాల జమ్మీలు, బొక్కా ఆదినారాయణ పాల్గొన్నారు.

వృద్ధురాలి అదృశ్యంపై కేసు



నాగమణి

అంబాజీపేట: ఆస్పత్రికి వెళ్లి వస్తానని చెప్పి మూడు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిన ఓ వృద్ధురాలు అదృశ్యం కావడంతో అంబాజీపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చిరతపూడి శివారు లంకవారిపేటకు చెందిన తవిటికి నాగమణి (78) ఈ నెల 5న ఆస్పత్రిక వెళ్లి వస్తానని ఇంటి నుంచి వెళ్లింది. నాగమణి ఎప్పటికీ రాకపోడంతో అమలాపురం ఆస్పత్రులు, బంధువుల ఇళ్ల వద్ద వెతికారు. అయినప్పటికీ ఆమె ఆచూకీ లభించకపోవడంతో ఈ నెల 7న ఫిర్యాదు చేశారని పోలీసులు తెలిపారు. వృద్ధురాలి కుమారుడు ఏడుకొండలు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

అతిగా వాడితే అనర్థం

- ఎరువుల వినియోగంపై అవగాహన
- రైతులతో వ్యవసాయ సిబ్బంది మమేకం
- రైతుల్లోనూ పెరిగిన చైతన్యం



ఉయ్యూరి వారి మెరక నక్కలపర్రలో ఎరువులు చల్లుతున్న రైతు

మలికిపురం: దాళ్వా వరి నాట్లు దాదాపు పూర్తి కావస్తుండడంతో వ్యవసాయ సిబ్బంది ఎరువుల వాడకంపై రైతులను పూర్తి స్థాయిలో సన్నద్ధం చేశారు. గతంలో ఎరువులు, పురుగు మందుల కంపెనీల ప్రతినిధులు గ్రామాల్లో పర్యటించి ఇష్టానుసారం ఎరువులను వాడించే వారు. ఫలితంగా దిగుబడిపై ప్రభావం చూపి రైతులకు మేలు అలా ఉంచితే నష్టం అధికంగా ఉండేది. అయితే గత కొన్నేళ్లుగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల వల్ల వ్యవసాయంలో అతిగా ఎరువుల వినియోగం తగ్గింది. ప్రైవేటు ఎరువుల కంపెనీల సిబ్బంది సంచారం కూడా తగ్గింది. ఫలితంగా రైతులు అవసరం మేరకు ఎరువులను వినియోగిస్తున్నారు. ఇప్పటికే కొత్తపేట, పి.గన్నవరం రాజోలు దీవిలో 99 శాతం వరినాట్లు పూర్తయ్యాయి. వ్యవసాయ మండల స్థాయితో పాటు గ్రామ స్థాయి సిబ్బంది కూడా నారుమడుల స్థాయి నుంచే ఎరువుల వినియోగంపై రైతులను పూర్తి స్థాయిలో సన్నద్ధం చేశారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల నేపథ్యంలో రైతుల్లో కూడా రానురానూ చైతన్యం, అవగాహన పెరిగింది. వ్యాపారులు, కంపెనీల ప్రతినిధుల మాటలను వినకుండా వ్యవసాయ సిబ్బంది చెప్పిందే వేదమంటున్నారు.

పెట్టుబడితోనే మార్పు

రైతులకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించిన పెట్టుబడితోనే ఇది సాధ్యమైంది. గతంలో వ్యవసాయానికి రైతులు పెట్టుబడికి ఇబ్బంది పడేవారు. ప్రైవేటు వడ్డీ వ్యాపారులు వద్ద అప్పులు, ఎరువుల వ్యాపారుల వద్ద అరువుకు ఎరువులు తేవడం వంటి సమస్యల వల్ల వ్యాపారులు ఇచ్చిందే వాడడం వంటి ఇబ్బందుతో వ్యవసాయంలో ఇష్టానుసారం ఎరువుల వినియోగంతో పాటు అవసరం లేని, ప్రయోజనం లేని నాసిరకం ఎరువులు, పురుగు మందులను కూడా వరి సాగుకు వాడాల్సి వచ్చేది. అయితే జగన్ ప్రభుత్వం రైతు భరోసా, పెట్టుబడి నిధి అందించడంతో పాటు వ్యవసాయ రుణాలు విరివిగా ఇవ్వడం వల్ల రైతులకు ఈ బాధ తప్పింది.

99 శాతం పూర్తి

కొత్తపేట, పి.గన్నవరం డివిజన్లతో పాటు రాజోలు డివిజన్‌లో రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి మండలాల్లో వరినాట్లు ఏకకాలంలో ప్రారంభమయ్యాయి. మొత్తం 99 శాతం వరినాట్లు పూర్తయినట్లు వ్యవసాయ అధికారులు పేర్కొన్నారు. గతం కంటే ఇక్కడ కూలీలకు డిమాండ్ పెరిగింది. కూలీల కొరతకు ప్రధాన కారణం గతంలో పొలం పనులు చేసేందుకు గ్రామస్తులు అధికంగా ఉండేవారు. రానురాను గ్రామాల్లో విదాభ్యాసం పెరగడం వల్ల గత ఇరవై ఏళ్లుగా కూలీల సంఖ్య తగ్గుతూ వస్తోంది. ప్రస్తుతం దాళ్వాలో కేవలం ఎకరం చేను నాట్లు వేయడానికి దమ్ముతో సహా రూ.10 వేలు ఖర్చవుతుంది. ప్రస్తుతం వరినాట్లకు బెంగాలీ నాట్లు అనే పేరు నడుస్తోంది. బెంగాలీ నుంచి కూలీలను తీసుకువస్తున్నారు. కేవలం ఎకరానికి 15 నుంచి 20 కేజీల విత్తనాల నారే సరిపోతుంది. ఆ కూలీలు కూడా కాంట్రాక్టు పద్ధతిన త్వరితగతిన నాట్లు వేస్తున్నారు. ఫలితంగా సమయం ఆదా అవుతుంది. కూలీల కొరత వల్ల గతంలో ఇక్కడికి కృష్ణా జిల్లా నుంచి కూలీలు వచ్చేవారు. ప్రస్తుతం కృష్ణా జిల్లాతో పాటు బెంగాలీ కూలీల హవా నడుస్తుంది. వరినాట్లు సీజన్‌లో ఉపాధి పనుల కార్మికులను వ్యవసాయ పనులకు పంపే విధంగా వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయం చేస్తున్నారు.

ఎరువులు, పురుగు మందులు వాడాలిలా..

దాళ్వా వరి పంటకు 72 కేజీల నత్రజని, 32 కేజీల భాస్వరం, 24 కేజీల పొటాష్ ఎరువులు కావాలి. నత్రజనిని మూడు దఫాలుగా అనగా 24 కేజీలు ఆఖరి దమ్ములోను నాట్లు వేసిన 15 నుంచి 20 రోజుల వ్యవధిలో 24 కేజీల చిరుపొట్ట దశలో అనగా 30 నుంచి 35 రోజుల్లో భాస్వరాన్ని దమ్ములో, పొటాష్‌ను 12 కేజీలు ఆఖరి దమ్ములో, 12 కేజీల చిరుపొట్ట దశలో వేసుకోవాలి. వీటిని ఎరువుల రూపంలో అయితే భాస్వరాన్ని డీఏపీ రూపంలో వేసినట్లుయితే ఒక అర బస్తా యూరియా బస్తాన్నర డీఏపీ 20 కేజీల పొటాష్ ఆఖరి దమ్ములోనూ, రెండో దఫాగా ఒక బస్తా యూరియా, మూడో దఫాగా ఒక బస్తా యూరియా, 20 కేజీల పొటాష్ వేసుకోవాలి. కాంప్లెక్స్ ఎరువులను పైపాటుగా వేయకూడదు. భాస్వరం ఎరువులని ఎప్పుడు కూడా ఆఖరి దమ్ములోనే వేసుకోవాలి. అదే విధంగా దాళ్వాలో ఇప్పుడు జింకు లోపం ఎక్కువగా కనిపిస్తుంది. కనుక జింక్ సల్ఫేట్‌ని వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేసుకోవాలి. వరి చేలో తెగుళ్లు కనిపిస్తే తప్ప పురుగుమందులు పిచికారీ వద్దు. అదే విధంగా ఇప్పుడు వరి పైరులో అక్కడక్కడా కాండం తొలచుపురుగు, ఆకుముడత కనిపిస్తుంది. దీని నివారణకు క్లోరిపైరిపాస్ 20 ఈసీ మందు లీటరు నీటికి 2.5 ఎంఎల్ లేదా కార్టాప్ హైడ్రో క్లోరైడ్ 50 ఎస్‌పి లీటరు నీటికి 2 గ్రాములు లేదా క్లోరాంతానిలిప్రోల్ 20 ఎస్‌పి 0.3 గ్రా పర్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

అధికారుల సూచనలు పాటించండి



వరి నాట్లు వేసిన రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించి ఎరువులు, పురుగుమందులు వాడండి. ప్రైవేటు డీలర్ల సూచనలు పాటించి ఇష్టానుసారం ఎరువులు వాడితే అనర్థాలు తలెత్తి నష్టపోతారు. గ్రామాల్లో పొలంబడి వంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ తమ సిబ్బంది అన్ని వేళలా రైతులకు అందుబాటులో ఉంటారు.

– రామ్మోహన్, ఏడీఏ, రాజోలు

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి తీర్థం



నర్సిపూడిలో తులసిమాలలతో అలంకార భూషితుడైన వేంకటేశ్వరస్వామి

పి.గన్నవరం: చిన అంతర్వేదిగా పేరొందిన ఊడిమూడిలోని లక్ష్మీ నరసింహస్వామి వారి తీర్థం శనివారం వైభవంగా జరిగింది. స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. రాత్రి స్వామి వారి కల్యాణం కనులపండువగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైభవంగా భీష్మ ఏకాదశి వేడుకలు

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం అశేష భక్త కోటి అత్యంత భక్తిశ్రద్ధలతో భీష్మ ఏకాదశి పర్వదినాన్ని జరుపుకొన్నారు. దీంతో అన్ని గ్రామాల్లోని వైష్ణవాలయాల్లో అంతటా ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. ఉభయ గోదావరి జిల్లాల్లో ప్రఖ్యాతి గాంచిన ఆలమూరు మండలంలోని చింతలూరులో వేంచేసిన ఉత్తర ముఖద్వార శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయంలోని దేవతామూర్తులను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అలాగే మండలంలోని పలు గ్రామాల్లో వేంచేసియున్న శ్రీ, భూ సమేత జనార్దనస్వామి వారి ఆలయాల్లో వేకువజాము నుంచి భక్తులు పోటెత్తడంతో క్యూలన్నీ కిక్కిరిసిపోయాయి. అలాగే ఆయా గ్రామాల్లో వైష్ణవాలయాల ప్రధాన అర్చకులందరూ దేవతామూర్తుల విగ్రహాలను పల్లకీలో ఉంచి ఊరేగించారు.

కన్నులపండువగా నృసింహుని రథోత్సవం



స్వామివారి సోదరి గుర్రాలక్క అమ్మవారికి చీర, సారె తీసుకువెళుతున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ తదితరులు

సఖినేటిపల్లి: అంతర్వేది పుణ్యక్షేత్రం శనివారం రథోత్సవం సందర్భంగా జన సంద్రమైంది. శుక్రవారం అర్ధరాత్రి దాటాకా లక్ష్మీనృసింహస్వామివారి కల్యాణతంతు ముగిసిన అనంతరం భక్తులు నేరుగా సముద్ర తీరానికి చేరుకుని పుణ్యస్నానాలు చేశారు. పుణ్యస్నానాలు ఆచరించడానికి వచ్చిన భక్తులతో తీరం జనసంద్రమైంది. నమో నారాయణ అంటూ స్వామిని కీర్తించారు. శనివారం మధ్యాహ్నం 2.05 గంటలకు నిర్వహించిన రథోత్సవం కనుల పండువగా సాగింది. రథానికి భక్తులు అరటి గెలలు, గుమ్మడి కాయలు కట్టించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

రథయాత్ర పొడువునా భక్తులు రథం తాళ్లు పట్టుకుని రథాన్ని ముందుకు లాగుతూ భక్తిపారవశ్యంతో ఓలలాడారు. తీర్థంలో భక్తులు ఉల్లాసంగా గడిపారు. పిల్లలు రంగుల రాట్నాలు, జెయింట్‌వీల్స్ ఎక్కి సందడి చేశారు. శుక్రవారం అర్ధరాత్రి స్వామివారి కల్యాణం, శనివారం మధ్యాహ్నం రథోత్సవం రెండు రోజులు ఒకదాని తరువాత మరొకటిగా వివిధ కార్యక్రమాలు కొనసాగుతుండడంతో భక్తులు పిల్లాపాపలతో సహా స్వామివారి సన్నిధిలోనే ఉండిపోయారు. ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తులు భక్తి పారవశ్యంలో ఓలలాడారు.

బాలాజీ ఆలయానికి పోటెత్తిన భక్తులు



అప్పనపల్లిలో స్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు

మామిడికుదురు: భీష్మ ఏకాదశి సందర్భంగా అప్పనపల్లి బాలబాలాజీ స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారు జామున తొలిహారతి కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు ఘనంగా జరిపించారు. తదుపరి సుప్రభాత సేవ వేద మంత్రాలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. పవిత్ర వైనతేయ గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. స్వామి వారికి తలనీలాలు సమర్పించారు. ముడుపులు, మొక్కులు చెల్లించారు. స్వామికి వివిధ సేవల ద్వారా రూ.5,75,559 ఆదాయం వచ్చింది. స్వామి వారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.1,09,590 విరాళాలుగా చెల్లించారు. లడ్డూ ప్రసాదం, విక్రయం ద్వారా రూ.1,01,505 ఆదాయం వచ్చిందని 15,000 మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారని ఆలయ ఈ ఓ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. 7,800 మంది స్వామి వారి అన్న ప్రసాదం స్వీకరించారన్నారు.

నల్లచెరువులో..

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలిమేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయం భీష్మఏకాదశి సందర్భంగా స్వామివారి దర్శనం కోసం శనివారం భక్తులు పోటెత్తారు. స్వామికి ఆలయ వేదపండితుల ఆధ్వర్యంలో తెల్లవారుజామున తోమాలసేవ, అర్చన, నైవేద్యం, నక్షత్ర హారతి, కుంభ హారతి వంటి విశేష పూజలు చేశారు. వేదపండితుల స్వామికి తులసిపూజ చేశారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. స్వామివారికి పటిక బెల్లం తులాభారం నిర్వహించారు. అధిక సంఖ్యలో స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

కమనీయంగా వేంకటేశ్వరుని కల్యాణం

అయినవిల్లి: మండలంలోని చింతనలంకలో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామికి వేదపండితుల ఆధ్వర్యంలో శనివారం రాత్రి భీష్మఏకాదశి సందర్భంగా కల్యాణం నిర్వహించారు. ఉదయం నుంచి స్వామికి ఆలయ అర్చకులు సుదర్శనం శోభనాద్రిచార్యాల ఆధ్వర్యంలో విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ప్రత్యేకరథంపై ఉంచి ఊరేగింపు జరిపారు. సాయంత్రం ఏడు గంటలకు స్వామివారి కల్యాణం వేదపండితుల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా జరిపారు. స్వామిని దర్శించుకోవాడానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

కార్యకర్తలకు అండగా నిలుస్తాం

- పొట్టిలంకలో 'కార్యకర్తలతో కాసేపు'
- అధిక సంఖ్యలో తరలివచ్చిన పార్టీ శ్రేణులు
- విఘ్నేశ్వరుని సన్నిధిలో ప్రత్యేక పూజలు



అయినవిల్లిలో మాట్లాడుతున్న గన్నవరపు శ్రీనివాసరావు, విప్పర్తి, గొల్లపల్లి తదితరులు

అయినవిల్లి: వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులకు అండగా నిలుస్తామని జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, "పి.గన్నవరం వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్, అయినవిల్లి జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు అన్నారు. పి.గన్నవరం వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా గన్నవరపు శ్రీనివాసరావు శనివారం అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. విఘ్నేశ్వరస్వామివారి ఆలయం నుంచి ముక్తేశ్వరం వరకూ పార్టీ నాయకులతో కలసి పాదయాత్ర చేశారు. స్థానికంగా ఉన్న వైఎస్ రాజశేఖరరెడ్డి, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మండలంలోని పొట్టిలంకలో విఘ్నేశ్వరుని ఆలయంలో కొబ్బరి కాయ కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. గన్నవరపు నాయకులలో కలిసి కార్యకర్తలతో కాసేపు కార్యక్రమంలో పాల్గొన్నారు. జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీ అమలు చేయడంలో విఫలమయిందన్నారు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీను, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వదేవి, మాజీ ఎమ్మెల్యే గొల్లపల్లి సూర్యారావు, పార్టీ నాయకులు మందపాటి కిరణ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతోందని మండిపడ్డారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కుడుపూడి విద్యాసాగర్, కొమ్ముల రాము, నక్కా వెంకటేశ్వరరావు, విత్తనాల శేఖర్, అయినవిల్లి ఎంపీపీ మట్టపర్తి నాగవిజయలక్ష్మి, అమలాపురం, అంబాజీపేట ఎంపీపీలు కుడిపూడి భాగ్యలక్ష్మి, దొమ్మేటి వెంకటేశ్వరరావు, అంబాజీపేట జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, అమలాపురం మున్సిపల్ చైర్మన్ నాగేంద్రమణి, నాయకులు స్టాలిన్‌బాబు తదితరులు ఉన్నారు.

శివరాత్రి ఉత్సవాలకు పందిరి రాట ముహూర్తం

కొత్తపేట: మహాశివరాత్రి ఉత్సవాలకు సంబంధించి పురాణ ప్రసిద్ధి చెందిన కొత్తపేట మండలం పలివెల ఉమాకొప్పేశ్వరస్వామి వారి క్షేత్రంలో శనివారం పందిరి రాట ముహూర్తం చేశారు. ఈనెల 26న మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని మూడురోజుల ముందు నుంచి వారం రోజుల పాటు ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తారు. ఆ మేరకు దేవదాయ–ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయానికి ఈశాన్యం వైపు పందిరి రాటకు పూజలు నిర్వహించి పాతారు. కార్యక్రమంలో దేవస్థానం అధికారులు, సిబ్బంది, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

బీజేపీ విజయంపై హర్షం

కొత్తపేట: దేశ రాజధాని ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించడంపై ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం హర్షం వ్యక్తం చేశారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ వరుసగా ఆప్ అధికారంలోకి రావాలన్న ఆశలు అడియాశలు కాగా కాంగ్రెస్ ఘోర పరాజయం పాలైందని పేర్కొన్నారు. అవినీతి ఆప్‌ను, అక్రమాల కాంగ్రెస్‌ను పక్కనబెట్టి ధర్మం కోసం, నీతి కోసం, ప్రజా సంక్షేమం కోసం పనిచేసే ఎన్‌డీఏకి పట్టం కట్టారని పాలూరి సత్యానందం అన్నారు.

అంబాజీపేట: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడంతో ఆపార్టీ నాయకులు అంబాజీపేట నాలుగు రోడ్ల సెంటర్‌లో పార్టీ మండలశాఖ అధ్యక్షుడు కముజు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం బాణసంచా కాల్చి, స్వీట్లు పంచారు. మామిడికుదురు, రాజోలు, పి.గన్నవరం మండలాల్లోనూ బీజేపీ విజయంపై ఆ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రకృతి చిత్రానికి గుర్తింపు



మధు గీసిన చిత్రం



మధును సన్మానించిన నిర్వాహకులు

మలికిపురం: ఈనెల 7, 8, 9 తేదీన హైదరాబాద్ జేఎన్టీయూలో క్రియేటివిటీ ఆర్ట్స్ అకాడమీలో నిర్వహించిన మాస్టర్ స్ట్రోక్ 4 లో 50 మంది చిత్రకారులతో ఒక ఆర్ట్స్ షోను నిర్వహించారు. అందులో సఖినేటిపల్లి మండలం మోరి గ్రామానికి చెందిన గంటా మధు చిత్రించిన చిత్రం మన పల్లెటూరు గ్రామాల్లో ఉండే అందమైన ప్రకృతిని అద్భుతంగా చిత్రించారు. ఇది హైదరాబాద్‌లో జేఎన్టీయూ యూనివర్సిటీ ప్రదర్శనలో జనాదరణ పొందింది. కార్యక్రమంలో జేఎన్టీయూ ప్రొఫెసర్లు, నిర్వాహకులు పాల్గొని చిత్రకారుడు మధును సన్మానించారు.

ఎన్నికల కోడ్ అమలు అపహాస్యం



ఇరుసుమండలో రోడ్డు పక్కనే ఉన్న టీడీపీ జెండా



విద్యుత్ స్తంభానికి ఉన్న టీడీపీ ఫ్లెక్సీలు

అంబాజీపేట: ఎన్నికల నిబంధనలను తప్పకుండా అమలు చేయాల్సిన అధికారులు అంబాజీపేట మండలంలో వాటికి పాతరేశారు. ఎన్నికల కోడ్ అమలోకి వచ్చి వారం రోజులు అవుతున్నా ఇరుసుమండలో పంచాయతీ కార్యాలయం సమీపంలో, ప్రధాన రహదారి పక్కనే టీడీపీ జెండా, విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేసిన టీడీపీ నాయకుల ఫ్లెక్సీలను నేటికీ తొలగించలేదు. నిత్యం ప్రయాణించే రహదారి పక్కనే ఉన్నా పంచాయతీ కార్యదర్శికి కూడా ఫ్లెక్సీలు కనిపించడం లేదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సాక్షాత్తూ ఎన్నికల నియమ నిబంధనలు అమలు చేయాల్సిన అధికారులే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శిస్తున్నారు. ఎన్నికల కోడ్ అమలు లేకి వచ్చిన వెంటనే గ్రామాల్లో ఉన్న ఫ్లెక్సీలను తొలగించాలంటూ పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీఓ సూచించారు. అయితే ఉన్నతాధికారి మాటకు విలువ ఇవ్వకుండా, కోడ్ ఉల్లంఘించి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు బహిరంగంగా విమర్శిస్తున్నారు.

విద్యార్థులకు పెన్నుల పంపిణీ



స్వామివారి కలాలను విద్యార్థులకు పంపిణీ చేస్తున్న ఆలయ ఏసీ సత్యనారాయణరాజు

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో ఇటీవల చదువుల పండుగ పేరుతో నిర్వహించిన స్వామివారి చెంత ఉంచిన లక్ష కలాలను శనివారం విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ పంపిణీ కార్యక్రమాన్ని ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్(ఏసీ) ముదునూరి సత్యనారాయణరాజు పంపిణీ చేశారు. విద్యార్థులు భారీ సంఖ్యలో తరలి వచ్చి స్వామివారిని దర్శించి, స్వామివారి పాదాల చెంత ఉంచిన కలాలను తీసుకున్నారు.

పోటెత్తిన భక్తులు

భీష్మ ఏకాదశి సందర్భంగా అయినవిల్లి విఘ్నేశ్వరుని ఆలయానికి భక్తులు పోటెత్తారు. స్వామికి ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి ప్రత్యేక అభిషేకాల్లో, శ్రీలక్ష్మీగణపతిహోమంలో 91 మంది భక్తులు పాల్గొన్నారు. చిన్నారుల అక్షర్యాభాసాల్లోను, అన్నప్రసాద, తులాభారం వంటి కార్యక్రమాల్లో 157 మంది చిన్నారులు పాల్గొన్నారు. స్వామివారి అన్నప్రసాదాన్ని 6530 మంది భక్తులు స్వీకరించారు. స్వామివారికి శనివారం ఒక్క రోజు రూ.4,29,769 వివిధ పూజలు, అన్నదాన విరాళాల ద్వారా ఆదాయం సమకూరినట్లు ఈవో ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

శనైశ్చరునికి ప్రత్యేక పూజలు

కొత్తపేట: శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామిని శనివారం అత్యధిక సంఖ్యలో భక్తులు దర్శించి, ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు జరిపించారు. శనికి ప్రీతికరమైన శనివారం పురస్కరించుకుని దేవదాయ–ధర్మదాయ శాఖ ఉప కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో భక్తుల పూజలకు ఏర్పాట్లు చేశారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా భక్తుల పూజలు, తైలాభిషేకాలు, టికెట్ల ద్వారా దేవస్థానానికి రూ.1,39,100, అన్నప్రసాద విరాళాల రూపంలో రూ.25,392తో మొత్తం రూ.1,64,492 ఆదాయం వచ్చినట్టు డీసీ అండ్ ఈఓ తెలిపారు.

ఘనంగా విశ్వేశ్వరస్వామి కల్యాణం

అంబాజీపేట: స్థానిక కోరివారి అగ్రహారంలో వేంచేసిన భువనేశ్వరి సమేత విశ్వేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని శనివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. వేకువజాము నుంచి స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం ఆలయ ప్రాంగణం వద్ద భారీ అన్నసమారాధన చేపట్టామన్నారు. పసుపల్లిలో వేంచేసిన వేంకటేశ్వర స్వామి వారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు.

వైభవంగా వీరన్నబాబు సంబరం

మామిడికుదురు: భీష్మ ఏకాదశి సందర్భంగా శనివారం పెదపట్నంలంకలో వీరన్నబాబు సంబరం వైభవంగా జరిగింది. మేళ, తాళాలు, మంగళ వాయిద్యాలు, బాణసంచా కాల్పుల నడుమ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా వైనతేయ గోదావరి నదికి ఊరేగింపుగా వెళ్లారు. అక్కడ నదీతీరంలో గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు జరిపించారు. కొమ్ముల సూరిబాబు, మిండగుదిటి కొండబాబు, కొమ్ముల సత్యనారాయణ, కొమ్ముల బూరియ్య దంపతులు సంబరంలో కర్తలుగా పాల్గొన్నారు. అనంతరం జమ్మిచెట్టు వద్ద ప్రత్యేక పూజలు చేశారు.

అందుబాటులో గుండెపోటు ఇంజక్షన్



ఆలమూరులో 'గుండెపోటు-ప్రాణహాని' అనే అంశంపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

ఆలమూరు: హృద్రోగ సంబంధిత సమస్యలతో బాధపడే రోగులకు హఠాత్తుగా గుండెపోటు సంభవించే వంటి విపత్కర పరిస్థితిలో సకాలంలో సత్వర వైద్యాన్ని అందించేందుకు వీలుగా ఖరీదైన ఇంజక్షన్ అందుబాటులో ఉందని ఆలమూరు సామాజిక ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ పి.గోపీరామ్, ప్రధాన వైద్యాధికారి ఎస్.అభిలాష్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో పరిసర ప్రాంతాలకు చెందిన అనేక మంది రోగులకు గుండెపోటు–ప్రాణహాని అనే అంశంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. గుండెపోటుకు గురైన రోగికి సత్వర వైద్యం అందించేందుకు వీలుగా హబ్ అండ్ స్పోక్ విధానంలో రూ.40 వేలు విలువ కలిగిన ఇంజక్షన్ అందుబాటులో ఉందని తెలియజేశారు. ఆ ఇంజక్షన్‌ను గుండెపోటు సంభవించే రోగికి ప్రాణపాయ స్థితి నుంచి రక్షించేందుకు ఉచితంగా అందించనున్నామన్నారు. గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న రోగులు ఏమాత్రం అధైర్యపడకుండా సీహెచ్‌సీ సేవలను వినియోగించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. హెడ్ నర్సు జగదాంబ, ల్యాబ్ టెక్నీషియన్ సురేష్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ కార్మికుడి మృతి

కొత్తపేట: మందపల్లి పెద్ద వంతెన సమీపాన స్టీల్ ప్లాంట్‌లో గాయపడిన ఒక కార్మికుడు మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకు మండలం మండపాకకి చెందిన బొర్రా సతీష్ (32) తన గ్రామానికి చెందిన మామిడిశెట్టి అర్జునరావు ద్వారా మందపల్లి సమీపాన స్టీల్ ఎక్ఛేంజ్ ప్రైవేట్ లిమిటెడ్ (స్టీల్ ప్లాంట్)లో వెల్డింగ్ కార్మికుడిగా పని చేస్తున్నాడు. గత నెల 26 మధ్యాహ్నం రెండున్నర గంటల సమయంలో ప్రమాదవశాత్తూ 56 అడుగులు ఎత్తులో ఉన్న రేకుల షెడ్‌పై నుంచి కింద పడిపోయాడు. వెంటనే అతడిని కొత్తపేట ప్రభుత్వాసుపత్రికి తీసుకుని వెళ్లి ప్రాథమిక చికిత్స అనంతరం అక్కడ రాజమహేంద్రవరం, అక్కడి నుంచి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. మృతుని భార్య దుర్గాభవాని ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్టు హెచ్‌సీ ఎం.వీర్రాజు తెలిపారు.